10, 11న రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 10, 11 తేదీల్లో రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలను నగరంలోని శాంతినగర్ కాలనీలోని స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించనున్నట్టు స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హారికా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల ఏడో తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వేసవిలో ఈత శిక్షణకు వచ్చిన క్రీడాకారులకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్-5, 6 నుంచి 7, 8 నుంచి 9, 10 నుంచి 11, 12 నుంచి 14, 15 నుంచి 17 విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలను ఆంధ్రప్రదేశ్ అమెచ్యుర్ ఆక్వాటిక్ అసోసియేషన్ పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200 అని, మరిన్ని వివరాలకు 7093182359 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

ధర్నా చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

బకాయిలు చెల్లించాలి

సహకార స్టోర్స్ ఎదుట విశ్రాంత ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ ఉద్యోగుల సహకార స్టోర్స్‌లో పనిచేసిన విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని, లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగుల సహకార స్టోర్స్‌లో పనిచేసిన విశ్రాంత ఉద్యోగులకు గ్రాట్యుటీ, సెక్యూరిటీ డిపాజిట్, గ్రూప్ ఇన్సూరెన్సు, పిఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని బొందిలీపురంలో ఉన్న సహకార స్టోర్స్ కార్యాలయం ఎదుట విశ్రాంత ఉద్యోగులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సహకార స్టోర్స్‌లో దశాబ్దాల తరబడి పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు అతి తక్కువ పెన్షన్‌తో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.కోట్ల విలువ చేసే ఆస్తులు కలిగి ఉన్న ఈ స్టోర్సు ఏటా రూ.కోటికి పైగా పన్ను చెల్లిస్తుందని కానీ, ఉద్యోగుల సెక్యూరిటీ డిపాజిట్, గ్రాట్యుటీ, బకాయిలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు స్టోర్స్ అధికారులను విశ్రాంత ఉద్యోగులు కలిసి సమస్యలు విన్నవించినా బకాయిలు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. ఉద్యోగ విరమణ సమయంలో చెల్లించాల్సిన గ్రాట్యుటీ, గ్రూప్ ఇన్సూరెన్సు, సెక్యూరిటీ డిపాజిట్, పిఎఫ్‌ను ఏళ్లు గడుస్తున్నా చెల్లించడం లేదన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో పెట్టడం వల్ల రిటైర్డు ఉద్యోగుల జీవనం కష్టంగా మారిందన్నారు. ధర్నా అనంతరం సహకార స్టోర్స్ మేనేజర్ జి.లక్ష్మణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి, కె.సూరయ్య, నగర కన్వీనర్ ఆర్.ప్రకాష్, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.పార్వతీశం, సిహెచ్.సూర్యనారాయణ, పి.గోపాలరావు, జి.సూర్యారావు, ఆర్.అప్పారావు, కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి 4జి సేవలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో దశలవారీగా 4జి సేవలను ప్రవేశపెడుతున్నట్లు బిఎస్ఎన్ఎల్ జిల్లా జనరల్ మేనేజర్ నాయుడు మరి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు 2జి, 3జి సిమ్‌కార్డును తక్షణమే 4జి సిమ్‌గా అప్‌గ్రేడ్ చేసుకోవాలని సూచించారు. 4జికి అప్‌గ్రేడ్ చేసిన తర్వాత 2జి, 3జి సేవలు కొనసాగుతాయని తెలిపారు. వినియోగదారులు తమ సిమ్ రకాన్ని (2జి, 3జి, 4జి) 54040కి SIM అనే సందేశాన్ని పంపించి తెలుసుకోవాలని సూచించారు. 2జి, 3జి సిమ్ ఉపయోగిస్తున్న వినియోగదారులకు కెవైసి పూర్తి చేయాలని సందేశం పంపించామని పేర్కొన్నారు. వినియోగదారులు ఎటువంటి అంతరాయం లేకుండా 4జి సేవలను ఆస్వాదించడానికి తమ సమీపంలోని బిఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్, ఫ్రాంఛైజీ, రీటైలర్లు, ఏజెంట్లను సంప్రదించాలని సూచించారు. ఈ సేవలను పూర్తి ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

గొట్టాబ్యారేజీ వద్ద దెబ్బతిన్న అప్రాన్

శ్రీకాకుళం జిల్లా హిరమండలం వద్ద వంశధారపై నిర్మించిన గొట్టాబ్యారేజీకి ముప్ప పొంచి ఉందని ఇంజినీరింగ్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతంలో కడప జిల్లాలో 2021, నవంబర్ 19న అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో అప్రమత్తమైన ప్రభుత్వం... రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులు, బ్యారేజీల భద్రతపై 11మంది సభ్యులతో ఇంజినీరింగ్, సాంకేతిక నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. కమిటీ బ్యారేజీని సందర్శించి పలు సూచనలు చేసింది. ఈ ఏడాది మేలో మరో కమిటీ సందర్శించి పరిశీలించి, తాజా పరిస్థితులతో సర్వే చేసి నివేదిక పంపాలని సూచించారు. సర్వే నివేదిక ఆధారంగా కొత్త డిజైన్లు రూపొందించనున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత కొత్త ఎస్ఎస్ఆర్ (స్టాండర్డ్ షెడ్యూల్ రేట్లు)తో మళ్లీ ప్రతిపాదనలు పంపనున్నారు.

గొట్టాబ్యారేజీకి ముప్ప

- వరద ప్రవాహానికి క్రమేణా దెబ్బతింటున్న అప్రాన్
- 2021-22లో రూ.12.91 కోట్లతో ప్రతిపాదనలు
- ఈ ఏడాది మేలో మరోసారి ఇంజినీరింగ్ నిపుణుల కమిటీ పరిశీలన
- తాజా పరిస్థితులతో సర్వే నివేదిక పంపిన అధికారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

హిరమండలం మండలంలోని గొట్టాబ్యారేజీ వద్ద 0.612 టిఎంసిల సామర్థ్యంతో 1977లో బ్యారేజీ నిర్మించారు. బ్యారేజీ ఎగువ భాగంలో ఎడమవైపున 3.6 కిలోమీటర్లు, కుడివైపు 6.2 కి.మీ మేర వరద కట్ట నిర్మించారు. బ్యారేజీకి ఆనుకుని దిగువ, ఎగువ భాగంలో 11.06 మీటర్ల వెడల్పుతో కాంక్రీట్ బ్లాక్‌లతో దృఢమైన అప్రాన్‌ను నిర్మించారు. అప్రాన్‌కు సపోర్టుగా పెద్ద పెద్ద బండరాళ్లను కట్టగా పేర్చారు. 2008, 2010 ఆగస్టులో వచ్చిన వరదలతో అప్రాన్ క్రమేణా దెబ్బతింటోంది. బ్యారేజీ దిగువ భాగంలో తాత్కాలికంగా మూడు మీటర్ల మేర రాళ్లను వేశారు. బ్యారేజీ పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో 2012 మార్చి 26న రూ.3.48 కోట్లతో మరమ్మతులు చేపట్టారు. ఆ తర్వాత వచ్చిన వరదలకు మరోసారి బండరాళ్లు కొట్టుకుపోయాయి. 2015లో హైదరాబాద్ నుంచి సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ నుంచి వచ్చిన చీఫ్ ఇంజినీరు సర్వే చేసి అదే ఏడాది మేలో తనిఖీ నివేదిక సమర్పించింది. బ్యారేజీ దిగువ భాగంలో అత్యవసర రక్షణ చర్యలు చేపట్టాలని సూచించింది. అధికారులు పంపిన ప్రతిపాదనలను పరిశీలించిన అప్పటి ప్రభుత్వం రూ.9.72 కోట్లు కేటాయిస్తూ 2017 ఫిబ్రవరి ఏడో తేదీన ఉత్తర్వులను వెలువరించింది. అప్పట్నుంచి పనులు చేపట్టకుండా పాలకులు నాన్చుతూ వచ్చారు. 2021-22 ధరల ప్రకారం దాని వ్యయం రూ.12.91 కోట్లకు చేరింది. ప్రస్తుత ధరలకనుగుణంగా వ్యయాన్ని లెక్కిస్తే మరో రూ.మూడు కోట్ల వరకు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వరద గట్లదీ అదే పరిస్థితి

వంశధారకు 80 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చిన సందర్భంతో గతేడాది ఆగస్టులో హిరమండలం బ్యారేజీ దిగువ భాగాన కొంతమేర వరద గట్టు కోతకు గురైంది. గట్టుకు అత్యవసరంగా మరమ్మతులు చేపట్టాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం విడుదల చేసిన రూ.10 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వంశధార కాలువ గట్లు ఎంత బలహీనమో 2021, జూలై 15న హిరమండలం వద్ద ఎడమ కాలువ కోతకు గురికావడం పరిశీలిస్తే తేటతెల్లమవుతుంది. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు మట్టి నానిపోవడంతో గొట్టాబ్యారేజీకి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఎలకల మెట్ల సమీపంలో కొంత గట్టు కొట్టుకుపోయింది. అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టినా ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు.

సాగునీటిపై ప్రభావం

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడికాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందించాల్సి ఉంది. కాలువల పరిస్థితి దయనీయంగా ఉండడంతో నిర్దేశించిన ఆయకట్టుకు నీరందడం లేదు. ముఖ్యంగా శివారు భూములకు నీరందని పరిస్థితి ఏటా పునరావృతమవుతోంది. సాగునీటి కాలువలు చాలా బలహీనంగా ఉండడం, కాలువల్లో పెద్దఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

వంశధార ఎడమ కాలువ సామర్థ్యం 2,450 క్యూసెకులు కాగా, కాలువ గట్లు బలహీనంగా ఉండడంతో 1800 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కుడి కాలువ సామర్థ్యం 800 క్యూసెక్కులు కాగా, 500 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. తోటపల్లి పాత రెగ్యులేటరీ వ్యవస్థ ద్వారా ప్రస్తుత ఖరీఫ్‌లో వీరఘట్టం, పాలకొండ పరిధిలోని 27,410 ఎకరాలకు సాగునీరందించాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. కాలువ పూర్తిస్థాయి సామర్థ్యం 414 క్యూసెక్కులు కాగా, అందులో మూడోవంతు నీటినీ విడిచిపెట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి.

ఘనంగా స్వాతంత్ర్య వేడుకల నిర్వహణ

- అవార్డుల కోసం శాఖల వారీ నివేదికలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు శాఖల వారీ అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డితో కలిసి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ముఖ్య అతిథి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ముఖ్య అతిథి ప్రసంగం, స్వాతంత్ర్య సమరయోధులతో పరిచయ కార్యక్రమం, మాక్ డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రశంసాపత్రాల పంపిణీ ఇతర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రతిష్టాత్మక పరేడ్ ఎస్‌పి పర్యవేక్షణలో జరుగుతుందని, వేదిక ఏర్పాట్లను ఇంజనీరింగ్, ఆర్‌డిఒ, శ్రీకాకుళం తహశీల్దార్లు పర్యవేక్షిస్తారని తెలిపారు. పలు శాఖలు శకటాల ప్రదర్శనకు సిద్ధం కావాలన్నారు. ప్రభుత్వ ప్రాదాన్యతలను ప్రతిబింబించేలా వీటిని రూపొందించాలని సూచించారు. ఆకర్షణీయంగా ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు అవార్డులు ఇచ్చేందుకు శాఖల వారీగా వివరాలు అందజేయాలన్నారు. ప్రతి శాఖ నుంచి ఇద్దరు, ముగ్గురు ఉద్యోగుల పేర్లు మాత్రమే ఇవ్వాలని స్పష్టం చేశారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని, వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ అప్పారావు, ఆర్‌డిఒలు సిహెచ్.రంగయ్య, భరత్‌నాయక్, సుదర్శనదొర, నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు, డిఎస్‌ఒ శాంతిశ్రీ, డిఎంహెచ్‌ఒ బి.మీనాక్షి, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ సీనియర్ సహాయకులు కృష్ణమాచార్యులు, జూనియర్ సహాయకులు శ్యామలరావుపై సస్పెన్షన్ వేటు పడింది. విశాఖ జిల్లా కరకచెట్టు పోలమాంబ దేవస్థానం నుంచి డిప్యుటేషన్‌పై వచ్చి అరసవల్లి ఆలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కృష్ణమాచార్యులు రెగ్యులర్ చేయిస్తానని చెప్పి కాంట్రాక్టు ఉద్యోగుల నుంచి రూ.లక్షలు వసూలు చేసినట్లు అభియోగాలు వచ్చాయి. దీనిపై శాఖాపరమైన విచారణ పూర్తి చేసిన కమిషనర్ ఎస్.సత్యనారాయణ అవి వాస్తవమని తేలడంతో ఆయన్ను సస్పెండ్ చేశారు. ప్రసాదాలు, లడ్డూ, నిత్యాన్నపథకం పర్యవేక్షిస్తున్న జూనియర్ సహాయకులు శ్యామలరావునూ సస్పెండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఉత్తర్వులు అందినట్లు ఆలయ ఇఒ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. విజయనగరం పైడితల్లి అమ్మవారి ఆలయ జూనియర్ అసిస్టెంట్ కె.వి రమణమూర్తిని డిప్యుటేషన్‌పై అరసవల్లి ఆలయంలో నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు.

ఖాతాదారుల సొమ్ము కైంకర్యం

- బ్రాంచి పోస్టుమాస్టర్ చేతివాటం
- కనిమెట్ట బ్రాంచి పోస్టాఫీసులో వెలుగుచూసిన వైనం
- విచారణ చేస్తున్న అధికారులు

పోస్టాఫీసులో విచారణ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పొందూరు

కూలీ నాలీ చేసుకుని వచ్చిన దాంట్లో కొంత సొమ్మును ఇంటి అవసరాలకు, మరికొంత ఆపద సమయంలో ఆదుకునేలా భవిష్యత్ అవసరాలకు దాచుకోవాలని అనుకున్నారు వారంతా. నెల నెలా కట్టుకునేందుకు వీలుగా గ్రామంలోని పోస్టాఫీసులో డిపాజిట్లు చేశారు. డిపాజిట్ చేసిన డబ్బుల్లో వేలాది రూపాయలు పోస్టుమాస్టర్ స్వాహా చేసిన ఘటన మండలంలోని కనిమెట్ట బ్రాంచి పోస్టాఫీసులో వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే బ్రాంచి పోస్టుమాస్టర్ జి.లోకేష్ రెండు రోజులుగా పోస్టాఫీసును తెరవడం లేదు. దీంతో అనుమానం వచ్చిన స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం పోస్టల్ అధికారులు చేరుకుని గ్రామ పెద్దలు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పోస్టాఫీసు తాళాలు తెరిచారు. పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆర్.గౌరీశంకర్ ఆధ్వర్యాన విచారణ చేపట్టారు. పోస్టాఫీసు పరిధిలోని ఎస్‌బి, ఆర్‌డి ఆకౌంట్లు కలిగిన ఖాతాదారులు తమ పుస్తకాలను తీసుకుని రావాలంటూ అధికారులు సమాచారం అందించారు. దీంతో తమ సొమ్ములు ఏమయ్యాయో అన్న ఆవేదనతో ఖాతాదారులు పోస్టాఫీసుకు పరుగులు తీశారు. ఖాతాదారుల పుస్తకాలను పరిశీలించిన అధికారులు అవకతవకలు చోటుచేసుకున్నట్లు గుర్తించారు. ఖాతాదారులు కట్టిన సొమ్మును పోస్టుమాస్టర్ వారి పుస్తకాల్లో నమోదు చేసినా, ఆ మొత్తాన్ని ఆఫీసులో చెల్లించకుండా తన సొంతానికి వినియోగించుకున్నట్లు గుర్తించారు. పోస్టాఫీసు పరిధిలో సుమారు 40 శాతం పుస్తకాలను తనిఖీ చేయగా సుమారు రూ.50 వేల వరకు అవకతవకలకు పాల్పడినట్లు సమాచారం. మిగిలిన ఖాతాదారుల పుస్తకాలన్నింటినీ పరిశీలించిన అనంతరం మొత్తం ఎంతన్నది తెలియాల్సి ఉందని అధికారులు చెప్తున్నారు. ఖాతాదారులు ఆందోళన చెందవద్దని, ఎటువంటి నష్టం కలగకుండా చూస్తామని అధికారులు హామీనిచ్చారు.

నిబంధనలకు విరుద్ధంగా విధులు

- విఆర్‌ఎల సమస్యలపై నేటి నుంచి దశల వారీ పోరాటం
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రెవెన్యూ శాఖ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా విఆర్‌ఎలతో రాత్రి విధులు చేయించడం తగదని, తక్షణమే ఈ విధానాన్ని విరమించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, గ్రామ రెవెన్యూ సహాయకుల (విఆర్‌ఎలు) సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.త్రినాథరావు, కోనాడ రమణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విఆర్‌ఎల సంఘ జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. అర్హులైన విఆర్‌ఎలకు అటెండర్, వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్, విఆర్‌ఒలుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో అమలు చేస్తున్న విధంగా రాష్ట్రంలోనూ విఆర్‌ఎలకు పేస్కేల్ జీతాలు చెల్లించాలన్నారు. రాత్రి విధులు నిర్వహిస్తున్న వారికి ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలన్నారు. మహిళా విఆర్‌ఎలను రాత్రి విధుల నుంచి మినహాయించాలని కోరారు.

ఖాళీగా ఉన్న విఆర్‌ఒ పోస్టులను విఆర్‌ఎలతో భర్తీ చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని విఆర్‌ఎలుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గత ప్రభుత్వం రికవరీ చేసిన డిఎను తిరిగి చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ నేటి నుంచి దశల వారీ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఈనెల 3వ తేదీన జిల్లావ్యాప్తంగా తహశీల్దార్లకు, 6న ఆర్‌డిఒలు, 14, 15 తేదీల్లో ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెలలో నిర్వహించే సంఘ మండల మహాసభలు, సెప్టెంబరులో నిర్వహించే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.సీతప్పడు, కె.అప్పారావు, ఎం.అప్పలస్వామి, కె.పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అన్ని స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ వెల్లడించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన పిఎన్‌డిటిసి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సిసి కెమెరాలు ఏర్పాటు చేశారా? లేదా? అని జెసి ప్రశ్నించారు. జిల్లాలో 19 ప్రభుత్వ, 83 ప్రైవేట్ స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి తెలిపారు. ఆడపిల్లల నిష్పత్తి పెంచాలని జెసి ఆదేశించారు. ఆడపిల్లల ఆవశ్యకత గురించి గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఆడపిల్లల నిష్పత్తి ఏ మండలాల్లో తక్కువ ఉంటే ఆ మండలాల్లో అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొత్తగా ఐదు ప్రైవేటు, 10 ప్రభుత్వ స్కానింగ్ కేంద్రాలు అనుమతి కోసం, రెన్యువల్స్ కోసం ఎనిమిది ప్రైవేట్ స్కానింగ్ కేంద్రాలు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. సమావేశంలో ఎఎస్‌పి ప్రేమ్‌కాజల్, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, ఎడిఎంహెచ్‌ఒ శ్రీకాంత్, ఎపిడిమాలజిస్ట్ సుజాత, ఇన్‌ఛార్జి డిఐఒ కె.వెంకటరావు, డిపిఎంఒ జి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

మాతాశిశు మరణాల నివారణే ధ్యేయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాతాశిశు మరణాల నివారణే ధ్యేయమని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ వైద్యాధికారులను ఆదేశించారు. మాతాశిశు మరణాల నివారణపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైరిస్క్ కేసులను వైద్యాధికారులే చూడాలని ఆదేశించారు. హైరిస్క్ కేసులను వేరే ఆస్పత్రులకు రిఫర్ చేస్తే సంబంధిత వైద్యాధికారి పర్యవేక్షణ ఉండాలన్నారు. మాతా శిశు మరణాలకు గల కారణాలను సంబంధిత వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మాతృ మరణాలు ఏడు, శిశు మరణాలు 11 నమోదైనట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి తెలిపారు. భవిష్యత్‌లో మాతా శిశు మరణాలు పునరావృతం కాకుండా చూడాలని జెసి ఆదేశించారు. ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ అంగన్వాడీ కేంద్రాల నుంచి గర్భిణులకు సరఫరా చేస్తున్న ఐరన్ ఫుడ్ (సంజీవని కిట్స్)పై వివరించారు. సమావేశంలో జిజిహెచ్ గైనకాలజిస్టు కె.పార్వతి, ఇన్‌ఛార్జి డిఐఒ పి.వెంకటరావు, ఆయా మండలాల వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాతో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సమరయోధుల స్మృతివనం తలమానికం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనం జిల్లాకే తలమానికమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని ఆర్మీ కాలింగ్ ప్రతినిధి బృందం నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియం నుంచి శాంతినగర్‌లోని స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనం వరకు జాతీయ పతాకంతో శుక్రవారం భారీ ప్రదర్శన చేపట్టారు. వందేమాతరం, భారత్ మాతాకీ జై నినాదాలతో హోరెత్తించారు. అనంతరం పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించి మాట్లాడారు. గాంధీ మందిరం, స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలోకి అడుగుపెట్టగానే భావోద్వేగానికి గురవుతోందని చెప్పారు. ఎక్కడా లేని విధంగా గాంధీమందిరం, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు, జాతీయ జెండా ఒకేచోట నెలకొల్పడం ఈ ప్రదేశం చారిత్రాత్మక ఘట్టాన్ని గుర్తుచేస్తోందన్నారు. విద్యార్థులు, ప్రజలు స్మృతివనాన్ని సందర్శించి త్యాగధనుల చరిత్రను తెలుసుకోవాలన్నారు. దేశానికి రెండు కళ్లుగా నిలుస్తున్న సైనికుడు, రైతు ప్రతిరూపంతో కూడిన అరుదైన విగ్రహాన్ని తనవంతుగా స్ఫూర్తివనంలో ప్రతిష్టిస్తానని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. అనంతరం పింగళి వెంకయ్య విగ్రహ దాత గుత్తు సరస్వతి కుటుంబంతో పాటు జాతీయ జెండాను మోసిన యువకులకు మెమెంటో, శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎం.ప్రసాదరావు, జామి భీమశంకర్, సురంగి మోహనరావు, నటుకుల మోహన్, కొంక్యాన వేణుగోపాల్, బాడాన దేవభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయినటువంటి బండారు సీతామహాలక్ష్మి దేవి అనసూయ W/o సింహాద్రి అప్పారావు R/a అల్లినగరం గ్రామం మరియు పోస్ట్ ఎచ్చెర్ల మండలం,శ్రీకాకుళం జిల్లా వారి తరపున ఇచ్చినటువంటి బహిరంగ ప్రకటన.

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అయిన బండారు సీతా మహాలక్ష్మి దేవి అనసూయ అనబడే ఆసామి కింజరాపు సూర్యనారాయణ నాయుడు S/o లేట్ సూర్యప్రకాశరావు అనబడే అసామిపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు శ్రీకాకుళం, కోర్టులో OS 56/2022. ప్రోనోటు దావా వేసి ఉన్నారు. ఆ దావాలో IA 18/2022.in OS 56/2022 లో గల దిగువ షెడ్యూలు ఆస్తిని కోర్టు వారు ప్రథమ జప్తు చేసి ఉన్నారు. దిగువ షెడ్యూలు ఆస్తిపై 22/2/2022. నుండి ప్రథమ జప్తు ప్రభావితమై ఉన్నది.

కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ప్రతివాది పైవిషయములు ఏమీ తెలియపరచకుండా దిగివ షెడ్యూలు ఆస్తిని అమ్మజూపడానికి ప్రయత్నం చేయుచున్నారని నా క్లయింటుకు తెలిసియున్నది.

కావున దిగువ షెడ్యూలు ఆస్తిని ఎవరైనా కొనడానికి ప్రయత్నించిన ఎడల, కొనుగోలు చేసిన తనఖా పట్టిన చట్టరీత్యా చెల్ల నేరవనియు మరియు నా క్లయింటు కు బంధించ వనియు, ఇందుమూలంగా యావన్మంది కి తెలియజేయడమైనది.

షెడ్యూలు ఆస్తి వివరాలు:-

శ్రీకాకుళం జిల్లా సబ్ రిజిస్టర్ శ్రీకాకుళం మండలం సానివాడ గ్రామం గ్రామపంచాయతీ in S.No. 3/3 part an extent of Ac. 0.35 cents out of Ac. 0.70 cents. of Dry land with in following boundaries:

తూర్పు : బండ్ల గోర్జ
దక్షిణం : డ్రై ల్యాండ్ ఆఫ్ రాజు.
పడమర : డ్రైలాండ్ ఆఫ్ వేణుగోపాలకృష్ణ రెడ్డి.
ఉత్తరం: డ్రై ల్యాండ్ ఆఫ్ కొర్ను సూర్యారావు.

పొన్నాడ మాధవి
అడ్వకేట్ శ్రీకాకుళం.
సెల్.8074011482

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

కవిటి : గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- కవిటి

పుట్టిన గంటలోపు తప్పనిసరిగా తల్లిపాలు (ముర్రిపాలు) అందించాలని అంగన్వాడీ సూపర్ వైజర్లు సుజాత, పల్లవి అన్నారు. మండలం భైరిపురం, వరక, రాజపురం, బిజి పుట్టుగ అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక కాలంలో చాలావరకు డబ్బా పాలవైపు మొగ్గు చూపు తున్నారని, ఇది పిల్లల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపిస్తుందన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని పికె పాలెం, కళింగపట్నం, కపాసుకుద్ది గ్రామాల నుంచి తీవ్రమైన పోషకలోపంతో బాధపడుతున్న ఆరుగురు చిన్నారులను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల స్థానిక నాయకులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మందస: మందస, హరిపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ మందస, హరిపురం వన్ సెక్టర్‌లో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపిటిసి సూపర్‌వైజర్ బి.మంగమ్మ, సిహెచ్ వి.రామలక్ష్మి, జయలక్ష్మి, హెల్త్ అడ్వైజర్, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తూరు: తల్లి పాలు వారోత్సవల్లో భాగంగా నివగాం పాఠశాలలో ఐసిడిఎస్ పిఒ విమల కుమారి ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. అలాగే తల్లులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు తల్లిపాలే శ్రేష్టం అన్నారు. కార్యక్రమములో సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, గౌశ్య బేగం, రమ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఐసిడిఎస్ పిఒ నాగరాణి ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. టి.బరంపురంలో ఎంపిపి బోర పుష్ప పాల్గొన్నారు. కార్యక్రమంలో 21వార్డు కౌన్సిలర్ ప్రతినిధి కాళ్ల జయదేవ్, 3వ వార్డులో కౌన్సిలర్ పత్రి తవిటయ్య పాల్గొన్నారు. మండపల్లిలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ నీలవేణి, అంగన్వాడీ కార్యకర్తలు బి.నరసమ్మ, ఎం.లలిత, కృష్ణవేణి, బతకల జగన్నాథం పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని బలగ సెక్టార్ బొందిలీపురం 2, ఇలిసిపురం, చిన్నబొందిలీపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ముందుగా ర్యాలీ నిర్వహించి తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న పిఒ నాగరాణి

సూపర్‌వైజర్ పి.యశోద, మహిళా కార్యదర్శి రేణుక, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.ధనలక్ష్మి, నాగమణి, వాణిశ్రీ, ఆర్. లక్ష్మీ, ఉమావతమ్మ, విమల, ఇందిర, విజయ, హైమ, ఆయాలు లక్ష్మీ నారాయణ, శాంతమ్మ, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

పలాస: మొగిలిపాడులో తల్లిపాల వారోత్సవాలపై అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో పుర వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గర్భిణీలకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మారావు, డి.సత్యం, పాఠశాల హెచ్ఎం జగన్మోహనరావు, అంగన్వాడీలు బి. నీలవేణి, కె.జ్యోతి, జి.ధనలక్ష్మి, మహిళా పోలీస్ మమత, ఆశాకార్తలు, గర్భిణీలు, బాలితలు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: లోలుగు, రాపాక గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పిలు రవి కుమార్ జ్యోత్స్న, ఎఎన్ఎం వనజాక్షి, హెల్త్ అసిస్టెంట్ అప్పారావు, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు రాక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే జిఎం, డిఆర్ఎంలతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. 2.30 గంటలకు హోటల్ సన్‌రైజ్‌లో కేంద్ర సామాజిక న్యాయశాఖ నిర్వహించే వికలాంగుల ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

117 జిఒను రద్దు చేయాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

విద్యారంగ సమస్యలపై అందుకు సంబంధించి జిఒ నెంబర్ 117ను ప్రభుత్వం తక్షణం రద్దు చేయాలని యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘ ప్రతినిధులు జిల్లా యుటిఎఫ్ కార్యదర్శి ఎం.వి.రమణ ఆధ్వర్యంలో స్థానిక ఎంఇఒ ఎస్.దేవేందర్‌రావు, ఎం.పద్మనాభరావు, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ తిరుపతి పట్నాయక్, తహశీల్దార్ హనుమంతరావుకు వినతిపత్రాలను అందించారు. ఎలిమెంటరీలో ఒకటి నుంచి ఐదు వరకు తరగతులు నిర్వహించాలని, పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని, కరెంటు బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలని తదితర సమస్యలపై డిమాండ్ చేస్తూ వినతి పత్రాలను అందించారు. వినతిపత్రం అందించిన వారిలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి వెంకటరమణ, మండల అధ్యక్షులు నీలకంఠ పాత్రో, ప్రధాన కార్యదర్శి అంకడాల లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షులు కిరోద్ కుంటియా, లలిత కుమారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను విచారణ చేస్తున్న విజయకుమారి

బినామీ ఉద్యోగిపై విచారణ

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బినామీ ఉద్యోగిగా పనిచేస్తూ విద్యార్థినులపై అనుచిత ప్రవర్తనకు పాల్పడినట్లు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం డిప్యూటీ డిఇఒ విజయకుమారి విచారణ చేశారు. పాఠశాలలో విద్యార్థినులపై అనుచితంగా ప్రవర్తిస్తున్నట్లు జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు వెళ్లగా ఆయన ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు విచారణ జరిపారు. దీనిపై పలు పత్రికల్లో కథనాలు రావడంతో జిల్లా విద్యాధికారుల ఆదేశాల మేరకు ఆమె పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులతో పాటు పలువురు విద్యార్థినులతో విచారణ జరిపారు. పాఠశాలలో జరిగే సంఘటనలపై జిల్లా అధికారులకు కనీస సమాచారం హెచ్ఎం అందించకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిపిన విచారణను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఉపాధి హామీ కూలీలను విచారణ చేస్తున్న ఎపిడి లోకేష్

విచారణ నివేదికను నివేదిస్తా

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని సైలాడ గ్రామ పంచాయతీలోని ఉపాధిహామీ ఫీల్డుఅసిస్టెంట్‌పై జరిగిన విచారణ నివేదిక డ్వామా పీడీకి నివేదిస్తానని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లోకేష్ తెలిపారు. ఉపాధిహామీలో గత కొంతకాలంగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పొగిరి సతీష్‌పై కూలీలు ఇచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం సైలాడ పంచాయతీ పరిధిలోని కుమ్మరిపేటలో ఎన్ఆర్ఇజిఎస్ అధికారులు విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభకు హాజరైన కొంతమంది కూలీలు ఫీల్డు అసిస్టెంట్ కొంతమంది గ్రామంలో లేని తన బంధువులకు మస్టర్లు వేసినట్లు ఆరోపించగా ఫీల్డ్‌అసిస్టెంట్ సతీష్‌పై కొంత మంది వ్యక్తిగత కారణాలతోనే తప్పుడు ఫిర్యాదు చేశారని ఎపిడి లోకేష్‌కు తెలిపారు. దీంతో గ్రామసభలో రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు ఒకరిపై ఒకరు కేకలు వేస్తూ వాగ్వాదానికి దిగగా పోలీసులు ఇరు వర్గాలను శాంతింప చేయడంతో ఘర్షణ సద్దుమణిగింది. అనంతరం ఎపిడి లోకేష్ ఇరువర్గాలకు చెందిన కూలీల అభిప్రాయాలను రాతపూర్వకంగా రికార్డ్ చేశారు. ఈ సందర్భంగా ఎపిడి మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీల ఫిర్యాదు మేరకు తాను విచారణ చేశానని ఇక్కడ జరిగిన అంశాలను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌కు నివేదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ ఎస్.లక్ష్మి నరసమ్మ, సర్పంచ్ సైలాడ దాసు నాయుడు, టిఎ సుధ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నాగేంద్ర కుమార్

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక శ్రద్ధ

పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ అన్నారు. రెడ్డిక వీధి, ముత్యాలమ్మ కోనేరు, కాశీబుగ్గ జిఎన్ బంగారు దుకాణం సమీపం, రామకృష్ణ నగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. పారిశుధ్య పనులపై కార్మికులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపాలిటీకి రూ.42.94 లక్షలు మంజూరు చేసిందని, ఈ నిధులు కేవలం మురికి కాలువలు శుభ్రం చేసేందుకు విని యోగించడం జరుగుతుందన్నారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని ప్రతి వార్డులో తొలగించడం జరుగుతుందన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివలక్ష్మి, బి.వి.రమణ, శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌కు స్థలం మంజూరు చేయాలి

పాతపట్నం : పాతపట్నంలో విలేకరులకు ప్రెస్‌క్లబ్ భవనం లేక ఇబ్బంది పడుతున్నామని, భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని స్థానిక విలేకరులు శుక్రవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు ఆయన క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అతి త్వరలోనే భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేసి, తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో శేఖర్, రవి, రమణ, అశోక్, జగన్, గోపి, భగవాన్, సంతోష్, రామారావు తదితరులున్నారు.

తహశీల్దార్లు బాధ్యతల స్వీకరణ

మెళియాపుట్టి : పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యాలయ సిబ్బంది

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల తహశీల్దార్‌గా నందిగాం హనుమంతరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎన్నికల విధుల్లో భాగంగా విజయనగరం జిల్లాలో పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా సొంత జిల్లాకు ఆయనను కేటాయించారు. గతంలో సారవకోట తహశీల్దార్‌గా పనిచేశారు. ఈయనను కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో డిటి వాన శంకరరావు, ఆర్ఐ వైకుంఠరావు, సర్వేయర్ చలపతిరావు, సీనియర్ అసిస్టెంట్ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: కొత్తూరు తహశీల్దార్‌గా పాపారావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనకాపల్లి జిల్లా మునపాక మండల తహశీల్దార్‌గా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎం.వి.ప్రసాద్ అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లారు.

కోటబొమ్మాళి: స్థానిక తహశీల్దార్‌గా ఆర్.అప్పలరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో విశాఖపట్నం జిల్లా యలమంచిలిలో పని చేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆయనకు రెవెన్యూ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

సోంపేట: మండల రెవెన్యూ అధికారిగా బి.అప్పలస్వామి బాధ్యతలు స్వీకరించారు. ఆయనను కార్యాలయ సిబ్బందితో పాటు రెవిన్యూ అధికారులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కార్యదర్శులు, విఆర్ఒలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంటర్మీడియట్ కీలకం

ప్రజాశక్తి- పలాస

విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదవాలన్నా, ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నా, తన దశ దిశ మార్చేందుకు ఇంటర్మీడియట్ కీలకమని, ఆ దిశగా విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులంతా ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బిసిసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పీరికట్ల విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, డొక్కరి శంకర్, జోగ మల్లేష్, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

జి.సిగడాం: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ఇచ్చిన ఉచిత పుస్తకాలను ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హైస్కూల్‌కు సంబంధించి బిల్లులు అందలేదని కాంట్రాక్టర్ మరుగుదొడ్లుకు తాళాలు వేసేశారని, ఆట మైదానం అక్రమణకు గురైనట్లు విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వ పాఠశాలలో

జి.సిగడాం : విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అపర్ణ, మజ్జి కన్నంనాయుడు, సిరుగుడి గోవిందరావు, సర్పంచ్ ప్రతినిధి ముద్దాడ గౌరీ, కూటమి నాయకులు కుమారపు రవి, మీసాల రవి, రఘురామ్, రామకృష్ణ, కుదిరిళ్ల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రేపు 'ఉత్తరాంధ్ర ఆకాంక్షలు-కార్యాచరణ' సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

'ఉత్తరాంధ్ర ఆకాంక్షలు-కార్యాచరణ' అంశంపై సన్నాహక సమావేశం ఈనెల నాలుగో తేదీన నగరంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేడాడ కష్ణారావు, మిస్కా కృష్ణయ్య, చౌదరి లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్రలో అన్ని వనరులు ఉన్నా నిర్లక్ష్యంతో కునారిలుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత సమస్యలను, పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణిని ప్రజా బాహుళ్యంలోకి తీసుకువెళ్లాలన్న ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇసుక రేవులను పరిశీలిస్తున్న తహశీల్దార్

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

ప్రజాశక్తి- బూర్జ

నది తీరాల్లో అక్రమంగా ఇసుక రవాణా చేపడితే కఠినచర్యలు తీసుకుంటామని తహశీల్దార్ జె.ఈశ్వరమ్మ స్పష్టం చేశారు. శుక్రవారం తహశీల్దార్‌గా బాధ్యతలను స్వీకరించిన అనంతరం మండలంలోని నారాయణపురం నది సమీపంలోని కాఖండ్యం గ్రామాన్ని సందర్శించారు. ఈ ప్రాంతం నుంచి ఇంతవరకు ఎవరికి ఎటువంటి ఇసుక రవాణాకు పర్మిషన్లు అందజేయలేదని తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఎవరికైనా పర్మిషన్లు ఉన్నట్లయితే కార్యాలయానికి వచ్చి అనుమతి పత్రాలను చూపిస్తే తద్వారా ఇసుక రవాణాకు అనుమతులు జారీ చేయడం జరుగుతుందన్నారు. అంతకుముందు నదీ తీర ప్రాంతాన్ని పరిశీలన చేశారు. ఎప్పటికప్పుడు ఇసుక అక్రమ రవాణా నివారించేందుకు విఆర్‌ఒలు, ఆర్‌ఐలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆమెతో పాటు రెవెన్యూ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ నిరీక్షణ?

కవిటి: కుల ధ్రువీకరణ పత్రాల కోసం ఇంకెన్నాళ్లు తాము వేచి చూడాలని బెంతు ఒరియాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యల పరిష్కారానికి బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 220వ రోజుకు చేరుకున్నాయి. అందులో భాగంగా శుక్రవారం దీక్షలో పాల్గొన్న రాజపురం గ్రామస్తులు మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రాలు లేక పోవడంతో తమ బిడ్డల చదువులు కుంటు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో అనేక మంది ఒరియా విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రాలు లేక పోవడంతో కొంతమంది విద్యార్థులు కళాశాల ప్రవేశాలు, మరికొంతమంది విద్యార్థులు హాస్టళ్లలో సీట్లు కోల్పోయారన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు తమగోడు పట్టించుకోవాలని కోరారు. తమ బిడ్డల భవిష్యత్ అంధకారంలో మగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

దీక్ష చేస్తున్న బెంతు ఒరియాలు

తాగునీరు అందించడమే లక్ష్యం

ఎచ్చెర్ల : శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ప్రజాశక్తి- జి.సిగడాం

ప్రతి గ్రామానికి తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మండలం దవలపేటలో శుక్రవారం జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ.45.80 లక్షలతో నిర్మించనున్న రక్షిత మంచినీటి పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామానికి తాగునీరు, వ్యవసాయానికి సాగునీరు అందించే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. యువతకు ఉపాధి కల్పించే విధంగా పని చేయడం జరుగుతుందన్నారు. అలాగే దవలపేట కాలువ పనులు, చెరువు పేరు మార్పు, విద్యుత్ సమస్యలు, వీధి కాలువలు, రోడ్లు వేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రంలో ఎంపిపి ప్రతినిధి వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, సర్పంచ్ మహేశ్వరరావు, కూటమి నాయకులు కుమారపు రవి, రఘురామ్, వెంకటేశ్వరరావు, అర్జునభూపాతి, మీసాల రవి ఎంపిడిఒ వెంకన్నబాబు, డిఇఇ సూర్యనారాయణ, ఎఇ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: మండలం తోటపాలెం పంచాయతీ హాఫీనఖాన్‌పేటలో జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ.56.80 లక్షల నిధులతో రక్షిత మంచినీటి పథకానికి ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు విశ్వక్సేన్, చౌదరి బాబ్జి, జీరు రామారావు, అమ్మినాయుడు, కోటిరెడ్డి, అరుణరెడ్డి, సంపాతిరావు నాగేశ్వరరావు, గురు అబ్బు, దారపు గోవిందరావు, అలుపున ఈశ్వరరావు హేమలత తదితరులు పాల్గొన్నారు.

టిడిపి హయాంలోనే ఆఫ్‌షోర్ పూర్తి

ప్రజాశక్తి- పలాస

మండలం రేగులపాడు వద్ద నిర్మాణం చేవడుతున్న ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను తమ హయాంలో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీషా అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు నిర్మాణం కోసం ఒక్కపైసా నిధులు విదుదల చేయలేదన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి 25 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో 2025 నాటికి కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసి తరగతులు ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. జన్‌మన్ పథకం కింద రూ.3.50 కోట్ల వ్యయంతో గిరిజన పాఠశాల మంజూరైందన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఈ సమస్యపై డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మున్సిపల్ మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, దీనిపై పవన్‌కళ్యాణ్ ఉద్దానం మంచినీటి పథకానికి నిధులు వెచ్చిస్తామని హామీఇచ్చారని తెలిపారు. గత ప్రభుత్వం ఎంపి నిధులతో అభివృద్ధి చేసేందుకు ముందుకు వస్తే మాజీమంత్రి

సమావేశంలో మాట్లాడుతున్న శిరీష

అప్పలరాజు అడ్డుకున్నారని విమర్శించారు. టిడిపి హయాంలోనే జీడి పిక్కలకు మద్దతు ధర లభించిందని, రూ.8 వేల నుంచి రూ.14 వేల వరకు ధర పెరిగిందన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్, కొరికాన శంకర్, దడియాల నర్సింహులు, ఎం చిన్ని, మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్ త్యాడి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విధులు సరే.. నిధులు ఎక్కడ..?

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించనున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు నిధులు ఆటంకం ఉపాధ్యాయులకు వెంటాడుతుంది. గడచిన ప్రభుత్వం నుంచి పాఠశాలల నిర్వహణకు ఒక్కపైసా కూడా నిధులు విడుదల కాలేదు. ఈ విద్యాసంవత్సరం ఆరంభమై రెండు నెలలు కావస్తున్నా ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా పాఠశాలలకు మెయింటినెన్స్ నిధులు విడుదల చేయలేదు. ఇటువంటి నేపథ్యంలో ఇప్పుడు వారం రోజుల వ్యవధిలో ఎస్ఎంసి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ నిధుల గండం వెంటాడుతుంది. ఎన్నికల నేపథ్యంలో నిబంధనల మేరకు నోటిఫికేషన్ జారీ చేసినప్పటి నుంచి ఓటర్ల జాబితా వెల్లడిచేయడం, ఎన్నికలకు సంబంధించిన కాగితాలు జిరాక్స్‌లు వంటివి తీయడానికి అవసరమయ్యే ఖర్చులు వేలాది రూపాయల్లో ఉన్నప్పటికీ ఎన్నికల అవసరం మేరకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో ఎన్నికల నిర్వహణ చేయడంలో ఉపాధ్యాయులకు చేతి చమురు వదలనుంది. ఇప్పటికే కనీస మౌలిక అవసరాలకు కూడా నిధులు విడుదల చేయని ప్రభుత్వం ఇప్పుడు కూడా నిధులు మంజూరు చేయక పోవడం గమనార్హం. ఎన్నికల సమయం నాటికి పాఠశాలకు వచ్చే గ్రామపెద్దలు, సర్పంచ్‌లకు, ఎన్నికోబడిన చైర్మన్, వైస్ చైర్మన్, తల్లిదండ్రులకు కనీస మర్యాదలు చేయడానికి కూడా నిధులు ఆటంకం వెంటాడుతుంది. చిన్న పాఠశాలల్లో అయితే ఉపాధ్యాయులు చేతిచమురు వదిలించుకున్నా పర్వా లేదు. కొన్ని మండలాల్లో పెద్ద పాఠశాల లున్నాయి. వందలాది మంది విద్యార్థులు ఉన్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ ఖర్చుతో కూడుకున్న పని. ఇటువంటి నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ ఎలా అని ఉపాధ్యాయులు తలలు పట్టు కుంటున్నారు. ఇదిలా ఉండగా అత్యంత ఆర్భాటంగా ఎస్ఎంసి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ విధులు, విధి నిర్వహణలు ఇచ్చినప్పటికీ నిధులు మంజూరు చేయక పోవడంపై ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

చందన (ఫైల్)

నగరంలోని విశాఖ-బి కాలనీకి చెందిన వివాహిత జామి చందన (30) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె భర్త శ్రీను సైకిల్‌పై సామాన్లను వీధుల్లో విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు. పెద్ద కుమారుడు దేవీ ప్రసాద్ ఏడో తరగతి చదవుతుండగా, కుమార్తె హారిక ఒకటో తరగతి చదవుకుంటోంది. చందన మానసిక పరిస్థితి కొన్ని రోజులుగా బాగాలేదని స్థానికులు చెప్తున్నారు. శుక్రవారం ఆమె భర్త బయటకు వెళ్లాక, పిల్లలు స్కూల్‌కు వెళ్లిన తర్వాత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

విద్యార్థుల మధ్య కొట్లాట

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల క్రితం విద్యార్థుల మధ్య కొట్లాట జరగడంతో ఓ విద్యార్థి చేయి విరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తరగతి గదిలో పుస్తకాల విషయంలో విద్యార్థులు ధనుంజయ, వెంకటరమణల మధ్య వివాదం నెలకొనగా విరామం సమయంలో మూత్రవిసర్జనకు వెళ్లిన సమయంలో కొట్లాట చోటు చేసుకుంది. ఇందులో ధనుంజయ అనే విద్యార్థి చేయివిరగ్గా, తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో ఆస్పత్రిలో చేర్చారు. ఇంత జరిగినా హెచ్ఎం పట్టించుకోలేదని తల్లిదండ్రులు ఆరోపించారు. పాఠశాలలో నాడు-నేడు పనుల్లో చేపట్టిన బాత్‌రూంలను వినియోగంలోకి తీసుకురాకపోవడంతో విద్యార్థులు మూత్రవిసర్జనకు బయటకు వెళ్లిన సమయంలో ఈ కొట్లాట సంఘటన చోటు చేసుకున్నట్లు సమాచారం.

బెల్లం ఊటలను ధ్వంసం చేస్తున్న ఎస్ఇబి సిబ్బంది

1500 లీటర్ల బెల్లంఊట ధ్వంసం

ప్రజాశక్తి- మందస

సోంపేట ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ సిబ్బందితో కలిసి మందస మండలం డోలకాయిలో నాటుసారా తయారీని అరికట్టేందుకు గ్రామ శివార్లలో దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1500 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. గ్రామంలో ఎవరు నాటుసారా బట్టీలు నిర్వహిస్తున్నారనే కోణంలో విచారణ చేసి వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. ఎవరైనా నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలను చేపడితే 9440902358 నెంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ దాడుల్లో ఎస్ఇబి ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది కాంతారావు, శాంతరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన మద్యం సీసాలతో ఎస్ఇబి అధికారులు

భారీగా మద్యం స్వాధీనం

ప్రజాశక్తి- పలాస

పలాస ఎస్ఇబి అధికారులు శుక్రవారం కాశీబుగ్గ మూడురోడ్ల జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా కర్నాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న భారీగా మద్యం బాటిళ్లను పట్టుకొని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. సిఐ అప్పారావు కథనం మేరకు మందస మండలం భేతాళపురానికి చెందిన పుక్కల దిలీప్ కుమార్, చెల్లూరి వెంకటేష్‌లు 90 ఎంఎల్ పరిమాణం ఉన్న 460 టెట్రా ప్యాకెట్లు, 180 ఎంఎల్ పరిమాణం ఉన్న 144 మద్యం టెట్రా ప్యాకెట్లు లగేజి బ్యాగుల్లో తరలిస్తున్నారు. మూడురోడ్ల జంక్షన్ వద్ద వారు అనుమానస్పదంగా తిరుగుతుండగా వారిని సోదా చేయగా అక్రమ మద్యం బయట పడింది. వీటిని కర్నాటక రాష్ట్రంలో కొనుగోలు చేసుకొని ఈ ప్రాంతంలో అమ్మకానికి తీసుకువచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు అరెస్టయిన వారికి పలాస కోర్టులో హాజరుపరిచారు. పట్టుబడిన మద్యంను సీజ్ చేసినట్లు సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పివి. గిరిబాబు, జివి.రమణారావు. సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఎంకు షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.వెంకటరావుకు జిల్లా విద్యా శాఖాధికారులు శుక్రవారం షోకాజ్ నోటీసును జారీ చేశారు. ఈ నెల 8న నిర్వహించే పిఎంసి ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోగా ఈ సమయంలో అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే సెలవు పెట్టడం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై హెచ్ఎంకు అధికారులు షోకాజ్ నోటీసును జారీ చేసినట్లు ఎంఇఒ-1 పి.వి.రామరాజు తెలిపారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని గంగంపేటలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. వైసిపికి చెందిన సర్పంచ్ తాగునీటి బోరుకు తాళం వేశారని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు గ్రామానికి చేరుకునే సరికి అప్పటికే సెక్రెటరీ సమస్యను తెలుసుకొని గ్రామస్తులకు అవసరమైన తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని పెద్దసాన గ్రామానికి చెందిన చమళ్ల సూర్యనారాయణ అనే యువకుడికి టెక్కలి అక్షర ఫౌండేషన్ ద్వారా సుమారు రూ.20 వేలు నగదు ఆర్థికసాయంగా అందజేసినట్లు ట్రస్టు చైర్మన్ బొడ్డేపల్లి నేతాజీ శుక్రవారం తెలిపారు. సూర్య నారాయణ అనే వ్యక్తి రైలు ప్రమాదంలో గాయపడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు కారణంగా వైద్యానికి డబ్బులు చాలక పోవడంతో అక్షర ఫౌండేషన్ తరుపున నగదును ఆయన సోదరుడు శివాజీకి అందజేసినట్లు నేతాజీ తెలిపారు.

మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే శిరీష

పచ్చదనంతో పర్యావరణానికి మేలు

పలాస: పచ్చదనంతో పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ కిడ్నీ ఆస్పత్రి ప్రాంగణంలో ఆ నలుగురు సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో అడవుల విస్తీర్ణం తగ్గిపోతోందని, రుతుపవనాలు ఆలస్యమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న అనర్థాలను అధిగమించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇప్పటికే తీర ప్రాంతంలో మడ అడవులను పెంపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వెల్లడించారు. ఆస్పత్రి ప్రాంగణంలో పచ్చదనం పెంపొందిస్తే ఆహ్లాదంతో పాటు అధిక మొత్తంలో ప్రాణవాయువు లభించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, టంకాల రవి శంకర్ గుప్తా, కొంచె నర్సింహులు, కుత్తుం లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ రఘుపతిరావు

8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

ప్రజాశక్తి- మందస

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ఈనెల 8న జరుగనున్నట్టు ఎంపిడిఒ అట్టాడ రఘుపతిరావు తెలిపారు. గురువారం మండలంలో పనిచేస్తున్న అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల హెచ్‌ఎంలతో ప్రత్యేక సమావేశం ఎంఇఒలు లక్ష్మణరావు, మర్రిపాటి భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈనెల 5న ఓటర్ జాబితాపై అభ్యంతరాలు స్వీకరణ, పరిశీలన, ఓటర్ల తుది జాబితాను పాఠశాల నోటీస్ బోర్డులో ప్రకటించడం జరుగుతుందన్నారు. అలాగే తల్లిదండ్రుల కమిటీ సభ్యుల జాబితా ప్రకటన చేస్తామని, అనంతరం తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందన్నారు. ఎన్నికైన వారిచే ప్రమాణస్వీకారం ఉంటుందని, అనంతరం నూతన తల్లిదండ్రుల సభ్యుల మొదటి సమావేశం జరుగుతుందని తెలిపారు. ఎస్ఎంసి ఎన్నికలు ఎటువంటి పక్షపాతం లేకుండా జరిపించాలని, ఎస్ఎంసి ఎన్నికల కష్టంగా ఉన్న స్కూల్లో పోలీస్ అధికారుల సహకారం తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు, పాఠశాల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు చేస్తున్న జగన్మోహనరావు

సేంద్రీయ పద్ధతులతో రైతులకు మేలు

ప్రజాశక్తి- కంచిలి

వ్యవసాయ సాగులో సేంద్రీయ పద్ధతులు పాటించడం వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.జగన్ మోహనరావు అన్నారు. మండలంలోని అంపురంలో శుక్రవారం గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. నారుమడులు వేసుకునేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నాట్లు వేసే ముందు చిగుళ్లు తుంచటం, దమ్ము మడుల్లో ఎరువుల మోతాదు అంశాలపై అవగాహన కల్పించారు. నాట్లు వేసేటప్పుడు గాలి, వెలుతురు తగిలేలా కాలిబాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఒ ధనంజయం, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మార్కెట్ రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి- పొందూరు

పట్టణంలో దశాబ్దాలుగా పాడైపోయిన మార్కెట్ రోడ్డుకు టిడిపి నాయకుల కృషితో మోక్షం కలిగింది. మార్కెట్ రహదారిలోని ఎంఎస్ఎన్ సైకిల్‌షాప్ సమీపంలో సుమారు 20 మీటర్లు మేరకు పూర్తిగా రోడ్డు పాడైపోయి గుంతలు ఏర్పడడంతో వర్షపునీరు చేరిపోయి రాకపోకలు సాగించే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్ తన సొంత నిధులతో సిసి రహదారి నిర్మాణం జరిపారు. దీంతో పట్టణవాసులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను టిడిపి పట్టణ అధ్యక్షులు అనకాపల్లి చిన్నరంగా, టిడిపి ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి, టిడిపి నాయకులు కె.శ్రీనివాసరావు, డి.రవికుమార్ తదితరులు పరిశీలించారు.

బాధిత కుటుంబాలకు సహాయం

ప్రజాశక్తి- గార

సముద్రంలో చేపల వేటకు వెళ్లి శ్రీలంకలో చిక్కుకున్న బాధిత మత్స్యకార కుటుంబాలకు సిక్కోలు ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. గార మండలంలోని చిన్నగనగళ్ల వానిపేటలోని వారి నివాసాలకు వెళ్లి గనగళ్ల కొరయ్య, దాసరి వెంకయ్య కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. సిక్కోలు ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏ అవసరం వచ్చినా తామంతా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఒక్కో కుటుంబానికి రూ.ఐదు వేలుతో పాటు, రెండు బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో రాయితీ చంద్రశేఖర్ (గబ్బర్), దుమ్ము అప్పన్న, సూరాడ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కెజిబివి ప్రవేశాలపై విచారణ చేపట్టాలి

శ్రీకాకుళం అర్బన్: జిల్లావ్యాప్తంగా కెజివిబి స్కూళ్లలో 6 నుంచి 12వ తరగతుల వరకు ప్రవేశాల్లో ఎస్‌సి, ఎస్‌టి రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు చేయకుండా ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల ఆధారంగా సీట్లు భర్తీ చేశారని, దీనిపై తక్షణమే విచారణ చేపట్టాలని జిల్లా దళిత, ఆదివాసీ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేటులో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సీట్ల భర్తీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయని సమగ్ర శిక్ష ఎపిసిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రజాసంఘాల నాయకులు బెలమర ప్రభాకరరావు, కోత ధర్మారావు, పేడాడ కృష్ణారావు, బల్లెడ రవి పాల్గొన్నారు.

స్కూల్‌కు కుర్చీలు వితరణ

ప్రజాశక్తి- లావేరు:

మండలం లక్ష్మీపురం యుపి స్కూల్‌కు స్వర్గీయ విశ్రాంత ఉపాధ్యాయులు మురపాక వెంకట రమణమూర్తి జ్ఞాపకార్థం వారి కుమారులు ఎం.ప్రసాదరావు బ్రదర్స్ మూడు కుర్చీలను బహుకరించారు. లావేరు గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు లక్ష్మీపురం యుపి స్కూల్‌ను దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 45 ఏళ్ల క్రితం చదివిన స్కూలు ప్రస్తుతం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని, ఉపాధ్యాయుల అంకిత భావం, విద్యార్థుల క్రమశిక్షణ తనకు ఎంతో నచ్చిందన్నారు. అలాగే పింగళి వెంకయ్య జయంతిని పాఠశాలలో జరుపుకున్నారు. తమ పాఠశాలకు కుర్చీలు అందించినందుకు హెచ్‌ఎం పి.వసంత లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శైలాదీప్తి, సునీత, యుగంధర్, శ్యాం కుమార్, చిన్న వెంకటరమణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కనుసన్నల్లో ఇసుక దోపిడీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

బూర్జ మండలం నారాయణపురం వద్ద నాగావళి నదిలో కొన్ని వందల సంఖ్యల లారీలతో ఇసుక దోపిడీకి పాల్పడిన టిడిపి నాయకులు నీతికథలు చెబుతున్నారని, ఈ దోపిడీ అంతా చంద్రబాబు కనుసన్నల్లోనే జరుగుతుందని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి నాయకుల అసలు రంగు బయటపడుతుందని, వారి ధనదాహం ఖనిజ సంపదను హరించి వేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి నారాయణపురం గ్రామానికి వందల సంఖ్యలో లారీలు చేరుకొని, నదిలో 5 జెసిబిలను దించి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న విషయం తెలుసుకున్న బూర్జ మండలానికి చెందిన వైసిపి కార్యకర్తలు ఫోటోలు, వీడియోలు తీసి తనకు పంపించారని తెలిపారు. ఫోన్‌లో వాటిని వెంటనే కలెక్టర్‌కు పంపించి ఫోన్‌లో తాను మాట్లాడానని, కలెక్టర్ ఆదేశాలతో అధికారులు అక్కడకు చేరుకొని పరిశీలించి ఇసుక అక్రమ తవ్వకాలను నిలుపుదల చేశారని తెలిపారు. అక్రమ తవ్వకాలు జరిపిన

సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

యంత్రాలు, లారీలను సీజ్ చేసి కేసులు ఎందుకు నమోదు చేయలేదో, దీని వెనుక ఉన్న టిడిపి పెద్దల వ్యవహారం బయటకు తెలియాల్సి ఉందన్నారు. నారాయణపురం ఆనకట్ట ఎగువన పేరుకుపోయిన మట్టి, బురద, ఇసుకను తొలగించడానికి ఇరిగేషన్ అధికారులు అనుమతి కోసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్‌కు ధరఖాస్తు చేశారని ఇంకా అనుమతులు రాలేదని ఆ పేరు చెప్పి టిడిపి పెద్దలు అక్రమ ఇసుక దోపిడీకి పాల్పడు తున్నారన్నారు. వర్షాకాలంలో మట్టి, బురద తొలగింపునకు ఎలా ధరఖాస్తు చేస్తారని, దీనిపై కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేస్తామని రవికుమార్ అన్నారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా ప్రచార విభాగం ఉపాధ్యక్షులు కొప్పల ఈశ్వరరావు, నాయకులు అన్నెపు కృష్ణ, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికే అధిక ప్రాధాన్యం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికే అధిక ప్రాధాన్యతను ఇస్తుందని మండల తెలుగు యువత అధ్యక్షులు తాడేల రాజారావు అన్నారు. శుక్రవారం మండలంలోని రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంచి రోజు మంచి భోజనం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి తాడేల వెంకటరమణ, రాజారావు కలిసి విద్యార్థులందరికీ మాంసాహార భోజనంతో పాటు స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న శాస్త్ర సప్తహ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గ్రామాల్లో ఉన్న ప్రతిఒక్కరూ ఒక్కరోజు మంచి భోజనం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటరమణ, రాజారావు అందించిన భోజనాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమణారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూస్తాం

ప్రజాశక్తి- పలాస

రైతులకు అండగా ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఉందని, ఎరువుల కొరత లేకుండా ప్రతి రైతుకు ఎరువులు అందేలా చూస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలం బ్రాహ్మణతర్లలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు తక్కువగా వచ్చాయని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకు వెళ్లి మరో మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో ఎరువులను తెప్పించి ప్రతి రైతుకు అందిస్తామన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాక ముందే వంశధార నీటిని శివారు ప్రాంతాలకు అందించామని, అదే విధంగా సకాలంలో డిఎపి, యూరియా ఎరువులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో

ఎరువులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

పిఎసిఎస్ సిఇఒ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ ఎడిఎ ఎల్.వి.మధు, ఎఒ పోలారావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్‌రావు, మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్, బి.నాగరాజు, ఆళ్ల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్ వాయు ఉద్యోగాలపై అవగాహనా సదస్సు

మాట్లాడుతున్న ప్రసాదరావు

శ్రీకాకుళం అర్బన్: అగ్నివీర్ వాయు ఉద్యోగాలపై అవగాహన యువతకు అవగాహన అవసరం అని సెట్‌శ్రీ సిఇఓ బి.వి. ప్రసాదరావు అన్నారు. 17 నుంచి 21 ఏళ్ల మధ్య వయసుగల యువతీ యువకులు అగ్ని వీర్ పథకంలో భాగంగా అగ్నివీర్ వాయిసేన లో చేరేందుకు వీలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఎయిర్‌ఫోర్సులో చేరేందుకు ఎయిర్ ఫోర్స్ రిక్రూటింగ్ అధికారులు, రిక్రూటింగ్ అధికారి ఎన్.సందీప్, దేవ్ కాంత్ మిశ్రా, డిఫెన్స్ సివిలియన్ నర్సింగ్ యాదవ్ ల ఆధ్వర్యాన నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల , మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఐటిఐలలో యువతకు అవగాహన శిబిరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెట్‌శ్రీ సిఈఓ బి.వి. ప్రసాదరావు మాట్లాడుతూ సికింద్రాబాద్ ఎయిర్ ఫోర్స్ నుండి రిక్రూటింగ్ ఆఫీసర్ నేరుగా యువకులతో మాట్లాడే ఒదుకు అవకాశం దక్కిందన్నారు. యువత సందేహాలను నివత్తి చేయడం ద్వారా విద్యార్థుల్లో ఆసక్తిని పెంచారన్నారు. విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలన్నారు. https://agnipathvayu.cdac.in ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ఆదివారంలోగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, ఎన్.సి.సి అధికారి పోలి నాయుడు, జిల్లా ఉపాధి కల్పన అధికారి కె సుధ, టూరిజం ఆఫీసర్ నారాయణ రావు, ఎన్‌వైకె యూత్ కో ఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్, విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లాలో టెక్కలి, నరసన్నపేట కళాశాలల్లో శని వారం అవగహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నేడు మెగా వైద్య శిబిరం

పలాస: మండలం లొత్తూరు, మున్సిపాలిటీ పరిధి పెంటిభద్రలో ఆదివారం స్టేట్ లీగల్ సర్వీస్ ఆథారిటి, చీఫ్ జస్టిస్ ఆదేశాల మేరకు ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పలాస సివిల్ జడ్జి యు. మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని గిరిజన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమన్వయంతో పనిచేయాలి

కవిటి: విఆర్‌ఒలు, డిజిటల్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తాహశీల్దార్ ఎం.మురళీమోహన్ సూచించారు. మండలం లోని విఆర్‌ఒలు, డిజిటల్ అసిస్టెంట్లతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడుతూ భూ సంబంధ విషయాల్లో క్షేత్రస్థాయిలో పనిచేసే విఆర్‌ఒలు సమన్వయంతో వ్యవహరించాలని, ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించాలని సూచించారు. అదే సమయంలో ప్రజల నుంచి వచ్చే వినతులపై డిజిటల్ అసిస్టెంట్లు పూర్తి అవగాహనతో వ్యవహరించి విధులు నిర్వహించాలన్నారు. డిటి టి.రామచంద్రరావు, ఆర్‌ఐ రమణమూర్తి, విఆర్‌ఒల సంఘం అధ్యక్షుడు వజ్జ బాలకృష్ణ, విఆర్‌ఒలు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నోటిఫికేషన్ జారీపై పర్యవేక్షణ

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8న నిర్వహించనున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు సంబంధించి అన్ని పాఠశాలల్లో నోటిపికేషన్ జారీ చేశారా లేదా అని ఎంఇఒలు శుక్రవారం పర్యవేక్షించారు. కొన్ని పాఠశాలల్లో గురువారం నోటిఫికేషన్ జారీ చేయలేదని ఆయా గ్రామానికి చెందిన వారు నేరుగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకు రావడంతో ఆయన సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారులకు చేసిన ఆదేశాల మేరకు మండల విద్యా శాఖాధికారులు శుక్రవారం ఆకస్మికంగా పాఠశాలలు సందర్శించి పాఠశాల నోటీస్ బోర్డును పరిశీలించి పర్యవేక్షించారు. ఎస్ఎంసి ఎన్నికల నిర్వహణపై ఖచ్చితత్వంగా వ్యవహరించాలని మండల విద్యా శాఖాధికారులు పాఠశాలల హెచ్‌ఎంలకు సూచిస్తున్నారు.

తయారీదారులకు ఆర్థిక ప్రయోజనం

ఆమదాలవలస : పట్టణంలోని మండల మహిళా సమాఖ్యలో అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. వెలుగు ఎపిడి పైడి కూర్మారావు మాట్లాడారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఏ వస్తువు తయారీ యూనిట్ అయినాపెట్టుకుంటే 35శాతం బ్యాక్ ఎండ్ సబ్సిడీతో కూడిన రుణ సౌకర్యం కల్పించబడుతున్నట్లు వివరించారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

ప్రజాశక్తి- పలాస

వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ శాఖ సహాయక సంచాలకులు ఎల్.వి.మధు అన్నారు. మండలం పూర్ణభద్రలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రైతులతో సమావేశం నిర్వహించి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో నాలుగు మండలాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, మండలంలో పూర్ణభద్ర పొలంబడి కార్యక్రమానికి ఎంపిక చేశామన్నారు. 14 వారాల పాటు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. ప్రతి గురువారం

పొలంబడిలో పంటలను పరిశీలిస్తున్న ఎడిఎ మధు తదితరులు

పొలంబడి కార్యక్రమం నిర్వహించడం జరుగు తుందన్నారు. రైతులు వరిసాగుపై మెళకువలు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల ఎఒ పోలారావు, ఎఇఒ సిహెచ్ శారద, సత్యవతి, స్వాతి, శ్రీనివాస్, రైతులు వరిశ తారకేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరిస్తున్న ఉద్యనవన శాస్త్రవేత్తలు

లావేరు: కొబ్బరితోటలు పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం రాగోలు ఉద్యనవన శాస్త్రవేత్త డాక్టర్ హారికుమార్ అన్నారు. శుక్రవారం లావేటి పాళెంలో యినపకుర్తి సీతారామరాజు పొలంలో ప్రథమ తరహా ప్రదర్శన క్షేత్రం కొబ్బరిలో సమగ్ర పోషక యజమాన్యం ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కొబ్బరిలో ఎరువులు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఒకే మొక్క చుట్టూ పళ్లెంలా తవ్వి ఒక కిలో యూరియా, రెండు కిలోల డిఎపి, రెండున్నర కిలోల పోటాష్, వంద గ్రాముల బోరాక్స్‌ను కలిపి రెండు విడతలుగా వేయాలని చెప్పారు. ఎరువులు వేసిన మరుసటి రోజు బోరాక్స్ వేయాలని సూచించారు. బోరాక్స్ వలన కొబ్బరి పూత, పిందెలు రాలడం నివారణ జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఎరువులు వేసే ముందు కలుపు నివారణ చేయాలన్నారు. అనంతరం నీరు పెట్టాలన్నారు. కార్యక్రమంలో విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ జి.నీలవేణి, ఉద్యన వనాధికారిణి ఎం.అనూష, విఎఎలు బగాది ప్రమీల,గిరిజ, రైతులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించి, సరైన మార్గంలో నడిపించడమే లక్ష్యమని జెసిఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన అనిల్ కుమార్ అన్నారు. నగరంలోని పి.ఎన్ కాలనీలోని న్యూ సెంట్రల్ స్కూల్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థి దశ ప్రతి వ్యక్తికి ఎంతో కీలకమని, ఈ దశలోనే సమాజంపై అవగాహన పెంచుకుని అభివృద్ధి దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో జెసిఐ

మాట్లాడుతున్న అనిల్ కుమార్

సభ్యులు సంతోష్ దూసి, స్కూల్ డైరక్టరు పి శ్రీకాంత్ మణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలో బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రెడ్డీస్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని బోరుభద్ర ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అవని అన్నారు. గతంలో ప్రభుత్వ హయాంలో నాడు నేడు పనుల్లో భాగంగా బోరుభద్ర ఆరోగ్య కేంద్రంలో పనులు ప్రారంభించినప్పటికీ పూర్తికాక అస్తవ్యస్తంగా ఆస్పత్రి మారింది. అనంతరం డాక్టర్ రెడ్డీస్ కంపెనీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా బోరుభద్ర ఆరోగ్య కేంద్రంను ఎంపిక చేశారు. ఈ అభివృద్ధి పనులను వైద్యాధికారి డాక్టర్ అవని పర్యవేక్షణలో చేస్తున్నారు. పిహెచ్‌సిలో అన్ని గదుల్లో పనులు ప్రారంభం పూర్తి అయిన వెంటనే వైద్య సిబ్బంది రోగుల ఇక్కట్లు తొలుగుతాయని వైద్యాధికారి తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా మరమ్మతులు, కొత్త నిర్మాణం, గోడలకు ప్లాస్టింగ్,

ఆరోగ్య కేంద్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులు

ప్లంబింగ్, విద్యుత్, ఫ్లోర్‌టైల్స్, రంగులు, తలుపులు, కిటికీలకు మరమ్మతులు, నీటి సరఫరా, మరుగుదొడ్లు తదితర పనులు డాక్టర్స్ రెడ్డి కంపెనీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఆరోగ్య కేంద్రం అభివృద్ధి చెందితే తీర ప్రాంత ప్రజలకు, మిగతా ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని డాక్టర్ తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడి

మెగా ప్లాంటేషన్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు

ప్రజాశక్తి- నౌపడ

నీటివసతి సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ పంటల ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని సంతబొమ్మాళి మండల ఉద్యానశాఖాధికారి కె.సునీత అన్నారు. సంతబొమ్మాళి మండలం కాకరాపల్లిలో సర్పంచ్ పల్లి జోగారావు ఆధ్వర్యంలో శుక్రవారం ఆయిల్‌ఫామ్ మెగా ప్లాంటేషన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక రైతు దుబ్బ అప్పారావు క్షేత్రంలో ఈనెల 15 నుంచి సెప్టెంబరు 15 వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. సాగు విధానం, మార్కెటింగ్ విధానం, అదే పంటలో అంతర పంటలుగా కూరగాయలు వేసుకోవడం ద్వారా ఎకరానికి రూ.లక్ష వరకు ఆదాయం పొందవచ్చన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా సాగుకు, కూలీ ఖర్చులకు మూడేళ్ల వరకు రాయితీ పొందవచ్చునని తెలిపారు. ఈ పంటకు ప్రభుత్వమే ప్రతినెలా రేటు నిర్ణయించి కొనుగోలు చేస్తుందని వివరించారు. రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ సిస్టమ్స్‌ను ప్రభుత్వం రాయితీ ద్వారా అందిస్తుందన్నారు. రైతులు మాట్లాడుతూ ఉద్యాన, ఇతర పంటలు వేసేందుకు ప్రభుత్వం నుంచి విద్యుత్, మోటార్ వసతులు రాయితీలో కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యాన విస్తరణాధికారి జి.సంధ్య, శాంతి ఇండస్ట్రీస్ సిబ్బంది ఎన్.శ్రీనివాసరావు, జగన్నాధరావు, మని కృష్ణ, గ్రామస్తులు పల్లి సత్యం, పల్లి సింహాచలం, దుబ్బ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో పింఛను అందజేత

ప్రజాశక్తి- కవిటి

మండలం రాజపురం-2 సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ బత్తుల హేమంత్ వైజాగ్‌లో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి పింఛను అందించి తోటి ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచాడు. రాజపురానికి చెందిన తెలుకుల తేజామణి అనారోగ్యానికి గురై వైజాగ్ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో పింఛను అందుకునే అవకాశం లేకపోయింది. విషయం తెలుసుకున్న హేమంత్ శుక్రవారం వేకువజామునే వైజాగ్ చేరుకొని ఆమెకు పింఛను అందించాడు. దీనిపై ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, కూటమి నాయకులు హేమంత్‌ను అభినందించారు.

జి.సిగడాం: మండల కేంద్రానికి చెందిన సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ పొగిరి రాము రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాయన పెంటన్నకు పింఛను

కవిటి : పింఛను అందజేస్తున్న హేమంత్

అందించారు. లబ్ధిదారుడు పెంటన్న వారం రోజుల నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నడవలేని స్థితిలో ఉన్నాడు. దీంతో రాము జెమ్స్ ఆస్పత్రికి వెళ్లి పింఛను అందించాడు. విషయం తెలుసుకున్న ఎంపిడిఒ వెంకన్నబాబు, గ్రామస్తులు రామును అభినందించారు.

మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యం

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

యువతపై మాదకద్రవ్యాల ప్రభావం పడకుండా వాటి నియంత్రణే లక్ష్యంగా కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం, వాటి దుష్ప్రభావాలపై అవగాహనా సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల సామాజిక, మానసిక, శారీరక అనారోగ్యాలు తలెత్తుతాయని తెలిపారు. దేశ భవిష్యత్‌ను కుంగదీసే మాదకద్రవ్యాలను పకడ్బందీగా అరికడదామన్నారు. యువతను చెడు మార్గం వైపు నడిపించే మాదకద్రవ్యాల అమ్మకాలు చేస్తున్న వారి సమాచారం తెలియజేయాలని కోరారు. విద్యార్థులు తమ క్యాంపస్‌లో ర్యాగింగ్‌ను నిషేధించాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కేవలం జ్ఞానం పెంచుకోవడానికి మాత్రమే

మాట్లాడుతున్న సన్యాసినాయుడు

ఉపయోగించుకోవాలని సూచించారు. మంచి కోసం మాత్రమే మొబైల్‌ను వినియోగించి భవిష్యత్‌కు బంగారు బాట వేసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో దిశ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రమణమూర్తి, డ్రగ్స్ కంట్రోల్ సహాయ సంచాలకులు ఎం.చందనరావు, జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.వి రమణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.అఖిల, ఎన్‌ఫోర్స్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎం.వినీషా పాల్గొన్నారు.

వ్యాధుల గుర్తింపులో అప్రమత్తత

ప్రజాశక్తి- నౌపడ

ప్రజలు తొలిదశలోనే దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి అప్రమత్తంగా ఉండాలని నౌపడ పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఒ.పరిమళ అన్నారు. సంతబొమ్మాళి మండలం మర్రిపాడులో శుక్రవారం సర్పంచ్ అట్టాడ కల్పన ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి చికిత్స నిమిత్తం ఆస్పత్రులకు రిఫర్ చేశారు. బిపి, షుగర్ తదితర వ్యాధులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

జాతీయ జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో ఇన్నీసుపేట మండల ప్రాథమిక పాఠశాలలో 170 అడుగుల జాతీయ పతాకం ఘనంగా ఆవిష్కరించారు. శుక్రవారం జాతీయ జెండా రూపశిల్పి, స్వాతంత్ర సమరయోధుడు స్వర్గీయ పింగళి వెంకయ్య జయంతిని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం ఆర్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కీలు సోమేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు బి.శంకరం, ఎం.తారకేశ్వరరావు, పి.దాశరథి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

ఆమదాలవలస: ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టు కోవాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్.వి. రమణమూర్తి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంఇఒ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని స్పష్టమైన హామీనిచ్చి అధికారంలోకి వచ్చారని, ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇచ్చిన హామీల్లో ప్రధానంగా పదకొండువ వేతన సవరణ బకాయిలు, మెరుగైన వేతనసవరణ, ప్రభుత్వవిద్యా వ్యవస్థనే కబలిస్తున్న 117 ఉత్తర్వు రద్దు, సిపిఎస్ రద్దు హామీలను నిలబెట్టుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆరువేల పోస్టులు పదోన్నతుల ద్వారా నింపుతామని విద్యాశాఖామంత్రి తెలిపారని వెంటనే షెడ్యూల్ విడుదల చేసి పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జి.రమణ, అన్నాజీబాబు, రామచంద్ర, రమేష్, రామారావు వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.